బాధితులకు ఆర్థిక సాయం

రామకృష్ణాపూర్, మే 27 : రామకృష్ణాపూర్‌లోని ఆర్కే-4 గడ్డ (శాంతినగర్)కు చెందిన గుజ్జ సుధాకర్ పక్షవాతం వచ్చి తీవ్ర ఆనారోగ్యానికి గురయ్యాడు. కాగా, ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నది. ఈ విషయం తెలుసుకున్న పట్టణ పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో రూ.28,626 సోమవారం అందించారు. పద్మశాలీ కుల బాంధవులు అందించిన నగదును సుధాకర్ కుటుంబానికి అందించిట్లు సంఘం ప్రధాన కార్యదర్శి ఆడెపు తిరుపతి, ఉపాధ్యక్షుడు ఆడెపు కృష్ణకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు కనుకుంట్ల సమ్మయ్య, అక్కిపెల్లి సమ్మయ్య, స్టీరింగ్ కమిటీ సభ్యులు బొద్దున మల్లేశ్, ఆడెపు లచ్చన్న, ఇప్పకాయల లింగయ్య, కుమార్, వేముల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

జన్నారంలో తోటి మిత్రుడికి..

జన్నారం, మే 27 : పొనకల్ శ్రీరాంనగర్‌కు చెందిన నగురు శ్రీనివాస్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న 1993-94 పదోతరగతి బ్యాచ్ మిత్ర బృందం రూ.26,200 జమ చేసి, కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫజల్‌ఖాన్, గొల్లపెల్లి వెంకటరమణ, రాజు, రాజన్న, ఎస్‌కే మక్సూద్, ఓదెలు పాల్గొన్నారు.

దండేపల్లిలో బాధిత కుటుంబానికి..

దండేపల్లి, మే 27 : దండేపల్లి మండలం కాసిపేట గ్రామానికి చెందిన కొదురుపాక మల్లేశ్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. నిరుపేద కుటుంబం కావడంతో హెల్పింగ్ హ్యాండ్స్ నిర్వాహకులు రూ.10వేల సాయం అందించారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్స్ నిర్వాహకులు కల్లెం రాజన్న, అప్పాల సునీల్, బక్కశెట్టి వెంకటేశ్, లక్కాకుల వెంకటేశ్, మదాసు వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

నాటు బాంబు పేలి ఎద్దుకు తీవ్రగాయాలు

సిర్పూర్(టీ), మే 27 : మండలంలోని వెంకట్రావ్‌పేట్ గ్రామంలో రైతు దండ్రె లటారుకు చెందిన ఎద్దు.. నాటు బాంబు పేలిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడింది. సోమవారం ఉదయం లక్ష్మీపూర్ శివారులో మేత మేస్తుండగా, అడవి పందుల కోసం అమర్చిన నాటు బాంబు పేలి మూతి, దవడ భాగం పూర్తిగా ఛిద్రమైంది. తీవ్రంగా రక్తం కారుతూ ఎద్దు ఇంటికి వచ్చింది. దీంతో అడవి పందుల కోరకు అమర్చిన నాటు బాంబు(గోలిలను) తినడంతో తన ఎద్దు తీవ్ర గాయాలపాలైందని, పరిహారం అందించాలని రైతు దండ్రె లటారు అటవీ అధికారులను కోరాడు. అదే విధంగా వన్యప్రాణుల కోసం వేటగాళ్లు ఇలాంటి పనులు చేస్తున్నారని, వారిని అధికారులు పట్టుకొని శిక్షించాలని కోరారు.

సభను విజయవంతం చేయాలి

కౌటాల, మే 27 : కాగజ్‌నగర్ పట్టణంలో బుధవారం మందిగ సంఘాల మహా కూటమి సభ నిర్వహించనున్నట్లు మాదిగ సంఘాల ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి భాస్కర్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో మాదిగ కులస్తులను కలిసి మాట్లాడారు. ఈ సభకు మాదిగ సంఘాల మహా కూటమి రాష్ట్ర చైర్మన్ పోకల కిరణ్ మాదిగా హాజరవనున్నట్లు తెలిపారు. మాదిగ సోదరులంతా పెద్ద సంఖ్యలో హాజరై, విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మండల నాయకులు గొడిసెల రవి, కోగిల శ్రీమాన్, సిద్ధెల దేవన్న, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

నర్సరీల పరిశీలన

చింతలమానేపల్లి, మే 27 : మండలంలోని రణవెల్లి, బూరెపల్లి, కోర్సిని, గంగాపూర్ గ్రామ పంచాయతీల్లోని నర్సరీలు, పల్లె ప్రకృతి వనాలు, సెగ్రిగేషన్ షెడ్, వైకుంఠధామాలను ఎంపీడీవో కోట ప్రసాద్ సందర్శించారు. నర్సరీలోల సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని, తడి చెత్త, పొడిచెత్త వేరుచేసి కంపోస్టు తయారీ చేయాలని, పల్లె ప్రకృతి వనాల్లోని చనిపోయిన మొక్కల స్థానంలో కొత్తవి నాటాలని, వైకుంఠధామం పరిసరాలు శుభ్రంగా ఉంచాలని సూచించారు. ఆయన వెంట ఏపీవో గోవర్ధన్ సింగ్, కార్యదర్శులు అశోక్, తిరుపతమ్మ, ప్రదీప్, తిరుపతి ఉన్నారు.

విజిలెన్స్ దాడులు ఆపాలి

నస్పూర్, మే 27 : ఆర్ఎంపీ, పీఎంపీలపై ఎన్ఎంసీ, టీఎస్ఎంసీ విజిలెన్స్ అధికారులు చేస్తున్న దాడులను వెంటనే ఆపివేయాలని మంచిర్యాల అర్బన్ అండ్ టౌన్ ఆర్ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కైలాసం, జనరల్ సెక్రటరీ రమేశ్ కోరారు. దాడులకు ఆర్ఎంపీలు భయభ్రాంతులకు గురవుతున్నారని, జిల్లాలో 23 మంది ఆర్ఎంపీలపై కేసులు పెట్టారని పేర్కొన్నారు.

తాండూర్ : కాసిపేటలో అవగాహన కల్పిస్తున్న మండల వ్యవసాయధికారి కిరణ్మయి

దండేపల్లి : అవగాహన కల్పిస్తున్న ఏవో అంజిత్‌కుమార్

కోటపల్లి : అవగాహన కల్పిస్తున్న ఏవో మహేందర్, ఏఈవో రాజ్ కుమార్

విత్తనాల ఎంపికలో జాగ్రత్త

- 'నకిలీ'లపై అప్రమత్తంగా ఉండాలి
- రైతులకు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు
- విస్తృతంగా అవగాహన సదస్సులు

తాండూర్, మే 27 : విత్తనాల కొనుగోలులో జాగ్రత్తలు తీసుకోవాలని, నకిలీ విత్తనాలపై అవగాహన కలిగి ఉండాలని తాండూర్ మండల వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు సూచించారు. మండలంలోని కాసిపేట, చంద్రపల్లి గ్రామాల్లో మండల వ్యవసాయాధికారిని గాదర్ల కిరణ్మయి.., పెగడపల్లి, రెపల్లెవాడ గ్రామాల్లో ఏఈవో పుష్పలత, అన్నారం గ్రామంలో ఏఈవో ధనలక్ష్మి ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహించారు. రైతులు వేసవి దుక్కులు సకాలంలో పూర్తిచేసుకొని వానాకాలం సాగుకు సంసిద్ధం కావాలన్నారు. నాణ్యమైన విత్తనాలు ఎంపిక చేసుకోవాలని, లైసెన్స్ కలిగిన దుకాణాల్లోనే కొనుగోలు చేయాలని సూచించారు. కొనుగోలు సమయంలో తప్పని సరిగా బిల్లులు తీసుకొని, పంటకాలం పూర్తయ్యే దాకా దాచుకోవాలన్నారు. విత్తన లాట్ నంబర్, కాలపరిమితి, గడువు తప్పనిసరిగా బిల్లులో ఉండేలా చూసుకోవాలని, ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు అమ్మితే తమకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో వ్యవసాయ విస్తరణాధికారులు, పంచాయతీ కార్యదర్శులు సాయికృష్ణ, తేజ, రైతులు పాల్గొన్నారు.

నాగసముద్రంలో..

దండేపల్లి, మే 27 : దండేపల్లి మండలం నాగసముద్రం గ్రామంలో విత్తనాల కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మండల వ్యవసాయాధికారి అంజిత్‌కుమార్ రైతులకు అవగాహన కల్పించారు. లూజ్‌గా సంచుల్లో విత్తనాలు కొనుగోలు చేయవద్దని సూచించారు. వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన అధీకృత డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో సుమన్, రైతులు పాల్గొన్నారు.

పారుపల్లి, పిన్నారం గ్రామాల్లో..

కోటపల్లి, మే 27 : కోటపల్లి మండలంలోని పారుపల్లి, పిన్నారం గ్రామాల్లో విత్తనాల కొనుగోలులో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఏఈవో రాజ్ కుమార్‌తో కలసి మండల వ్యవసాయ శాఖ అధికారి మహేందర్ అవగాహన నిర్వహించారు. నకిలీ విత్తనాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే వెంచపల్లి, సూపాక గ్రామాల్లో ఏఈవో వైష్ణవి.., జనగామ, ఆలుగామ గ్రామాల్లో ఏఈవో అనూష.., అన్నారం గ్రామంలో ఏఈవో శేఖర్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

లక్షెట్టిపేట మండలంలో..

లక్షెట్టిపేట, మే 27 : మండలంలోని ఇటిక్యాల, గుల్లకోట, సూరారం, చందారం, వెంకట్రావుపేట గ్రామాల్లో మండల వ్యవసాయ శాఖ అధికారి ప్రభాకర్‌రెడ్డి రైతులకు విత్తనాల కొనుగోళ్లపై అవగాహన కల్పించారు. విత్తనాలు కొనుగోలు చేసిన దుకాణం నుంచి తప్పకుండా రసీదు తీసుకోవాలని, పంట పంట పూర్తయ్యే దాకా భద్రపర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో ఏఈవోలు ప్రసన్న, గోవర్ధన్, శ్రీనివాస్, ఇర్ఫాన్ యాస్మీన్, అనూష, రైతులు ఉన్నారు.

శంకర్‌పల్లి, చిర్రకుంటలో..

మందమర్రి రూరల్, మే 27 : మందమర్రి మండలం శంకర్‌పల్లి, చిర్రకుంట గ్రామ పంచాయతీల పరిధిలో రైతులకు మండల వ్యవసాయ అధికారి రాజేశం అవగాహన కల్పించారు. అధికారుల సూచనల మేరకు ఎరువులు, విత్తనాలు వాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి ముత్యం తిరుపతి, శంకర్‌పల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజేశ్, కారోబార్ హర్ష, రైతులు ఓడ్నాల కొమురయ్య, రాంచందర్, రాజయ్య, మహిళా రైతులు తదితరులు పాల్గొన్నారు.

దరోగపల్లి, చేడ్వాయి గ్రామాల్లో..

పెంచికల్‌పేట్, మే 27 : మండలంలోని దరోగపల్లి, చెడ్వాయి గ్రామాల్లో నకిలీ విత్తనాలపై ఏఈవో గౌసియాబేగం రైతులకు అవగాహన నిర్వహించారు. గ్రామంలో ఎవరైనా లూజ్ నకిలీ విత్తనాలు అమ్మితే వ్యవసాయ అధికారులకు సమాచారం అందించాలన్నారు. అలాగే వేసవి దుక్కులు, పచ్చిరొట్ట ఎరువులు ద్వారా కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు, పెద్దలు పాల్గొన్నారు.

వేమనపల్లి మండలంలో..

వేమనపల్లి, మే 27 : కేతనపల్లి, కల్మలపేట, బుయ్యారం, జిల్లెడ, జక్కెపల్లి, నాగారం, సూరారం గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించారు. ఆధీకృత డీలర్ల వద్దనే విత్తనాలు కొనాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో ఏఈవోలు రుక్సార్ సుల్తానా, సంతోష్‌కుమార్ రైతులు పాల్గొన్నారు.

చిత్తాపూర్‌లో..

నెన్నెల, మే 27 : మండలంలోని చిత్తాపూర్‌లో భీమిని ఏడీఏ ఇంతియాజ్ ఆహ్మద్ రైతులకు విత్తనాల కొనుగోలుపై అవగాహన కల్పించారు. విత్తనాలు కొనుగోలు చేస్తే తప్పకుండా రసీదు తీసుకొని జాగ్రత్త గా ఉంచుకోవాలని సూచించారు. ఏఈవోలు రాంచందర్, మౌనిక, రైతులు పాల్గొన్నారు.

బెజ్జూర్ మండలంలో..

బెజ్జూర్, మే 27 : మండలంలోని పోతెపల్లి, బారెగూడ, ముంజంపల్లి గ్రామాల్లో రైతులకు ఏవో రాజుల నాయుడు అవగాహన కల్పించారు. వానాకాలం సాగుకు రైతులంతా సన్నద్ధమవుతున్న నేపథ్యంలో రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే వేసవి దుక్కులు, పచ్చిరొట్ట ఎరువుల వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో రవితేజ, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

గుండాయిపేటలో..

కౌటాల, మే 27 : మండలంలోని గుండాయిపేటలో ఏఈవో చైదరి అంజన్న రైతులకు అవగాహన కల్పించారు. సీల్ తీసిన విత్తన ప్యాకెట్లు, లూజ్ విత్తనాలకు కొనుగోలు చేయకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

లక్షెట్టిపేట : ఇటిక్యాలలో వ్యవసాయ శాఖ అధికారి

బెజ్జూర్ : ముంజంపల్లిలో ఏవో రాజుల నాయుడు

నెన్నెల : అవగాహన కల్పిస్తున్న ఏడీఏ ఇంతియాజ్

ఫర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీ

సిర్పూర్(టీ), మే 27 : మండల కేంద్రంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాల్లో మండల వ్యవసాయాధికారి మధులత తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు అధిక ధరలకు ఎరువులను విక్రయించవద్దని సూచించారు. లేకపోతే దుకాణా యజమానులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం మండలంలోని హీరాపూర్ గ్రామంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రైతులకు విత్తనాలు, విత్తన కొనుగోళ్లలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో శోభారాణి, రైతులు పాల్గొన్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న ఏవో మధులత

ఒకరికి జైలు శిక్ష

మంచిర్యాల ఏసీసీ, మే 27 : దొంగతనం కేసులో మంచిర్యాల పట్టణంలోని తిలక్‌నగర్‌కు చెందిన మెస్రం రాజుకు 20 నెలల జైలు శిక్షతో పాటు రూ.100 జరిమానా విధిస్తూ మంచిర్యాల రెండో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు జడ్జి నిరోష సోమవారం తీర్పునిచ్చినట్లు పట్టణ సీఐ బన్సీలాల్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల పట్టణంలోని హమాలీవాడకు చెందిన కుమార్.. 2022, సెప్టెంబర్ 30న సాయంత్రం ఇంటికి తాళం వేసి వెళ్లాడు. రాత్రి వచ్చేసరికి పగలగొట్టి, తలుపులు తెరిచి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా, రూ.10 వేల సామగ్రి, బీరువాలోని రూ.10 వేల నగదు ఎత్తుకెళ్లినట్లు గుర్తించాడు. ఈ మేరకు ఎస్ఐ రాజేందర్ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు. దొంగతనానికి పాల్పడ్డ మెస్రం రాజు, ఎకార్ అలీని అరెస్టు చేశారు. విచారణ పూర్తి చేసి, కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. సోమవారం కోర్టులో హాజరుపర్చగా, నేరం రుజువైంది. దీంతో మెస్రం రాజుకు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

జూన్ 3 నుంచి పదోతరగతి సప్లిమెంటరీ పరీక్షలు

నస్పూర్, మే 27 : జిల్లాలో జూన్ 3వ తేదీ నుంచి 13వ తేదీ వరకు పదోతరగతి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు మంచిర్యాల డీఈవో యాదయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. కేంద్రాల్లో అవసరమైన మందులు, మెడికల్ కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లతో ఆరోగ్య కార్యకర్తలు అందుబాటులో ఉంటారని వెల్లడించారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగేందుకు సంబంధిత అధికారులను సమన్వయం చేశామని తెలిపారు.

పీవీటీజీ గురుకులంలో ప్రవేశాలు

ఆసిఫాబాద్ టౌన్, మే 27 : గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పీవీటీజీ గిరిజన గురుకుల పాఠశాల ఆసిఫాబాద్‌లో 2024-25 విద్యా సంవత్సరానికి గాను దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సురేశ్ సోమవారం ఒక ప్రకటనలో పారు. ఈ నెల 30వ తేదీలోగా తమ దరఖాస్తులను సమర్పించాలని పేర్కొన్నారు. 3వ తరగతిలో 80.., 4వ తరగతిలో 40.., 5వ తరగతిలో 41.., 9వ తరగతిలో 7 సీట్లు (మొత్తం 168) భర్తీ చేయనున్నట్లు వివరించారు. పీవీటీజీ తెగలైన కొలాం, తోటి, మన్నె(కొలవార్) విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

తాండూర్, మే 27 : తాండూర్ ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పీ శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే ఈ సమావేశంలో అభివృద్ధి పనులు, సమస్యలు తదితర అంశాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు ప్రగతి నివేదికలను మందుగానే ఎంపీడీవో కార్యాలయంలో అందించాలని తెలిపారు. సకాలంలో హాజరవ్వాలని కోరారు.

రైల్వే అండర్ బ్రిడ్జి మూసివేత

తాండూర్, మే 27 : మండల కేంద్రంలోని పెట్రోల్ పంప్ ప్రాంతంలోని రైల్వే అండర్ బ్రిడ్జి (ఎల్‌సీ నంబర్-66) మూసివేస్తున్నట్లు బెల్లంపల్లి రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజినీర్ సురేశ్ సోమవారం తెలిపారు. రైల్వే అండర్ బ్రిడ్జి గుంతలమయమై వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఇటీవల ఎంపీటీసీ సిరంగి శంకర్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఈసా రైల్వే అధికారులకు వినతి పత్రం సమర్పించారు. దీంతో స్పందించిన అధికారులు మరమ్మతులకు పూనుకున్నారు. ఈ మేరకు రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద అప్రోచ్ రోడ్డు మరమ్మతుల కోసం 29 నుంచి జూన్ 9వ తేదీ వరకు మూసివేయనున్నట్లు సురేశ్ పేర్కొన్నారు. ఐబీ శనివారం అంగడి సమీపంలోని, కాసిపేట వెళ్లే దారిలో గల రైల్వే అండర్ బ్రిడ్జిలు, అలాగే సెయింట్ థెరిసాస పాఠశాల వద్ద గల రైల్వే గేట్ వద్ద నుంచి రాకపోకలకు మార్గం ఉంటుందని తెలిపారు. మండల ప్రజలు ఈ విషయాన్ని గమనించి, సహకరించాలని కోరారు.

అందుబాటులో జీలుగ విత్తనాలు

చెన్నూర్ రూరల్, మే 27 : చెన్నూర్ పట్టణంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సబ్సిడీపై జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని చెన్నూర్ ఏవో మార్క్ గ్లాడిస్టన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు ప్రధాన పంటలు వేసే ముందు పచ్చిరొట్ట సాగుచేయడం ద్వారా భూములు సారవంతం చేసుకోవచ్చని పేర్కొన్నారు. దీంతో అనేక లాభాలు ఉంటాయని తెలిపారు. విత్తనాలు కావాల్సిన తులు పట్టాపాస్ పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్‌తో వ్యవసాయ శాఖ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

వేమనపల్లిలో..

వేమనపల్లి, మే 27 : మండలంలోని రైతులకు 60 శాతం సబ్సిడీతో జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఏవో వీరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల రైతులు ఆగ్రోస్ రైతు సేవా కేంద్రానికి పట్టాపాస్‌బుక్, ఆధార్‌కార్డుతో వచ్చి తీసుకోవాలని సూచించారు.

ఎంఈవోను సస్పెండ్ చేయాలి

నస్పూర్, మే 27 : బెల్లంపల్లి ఎంఈవోను సస్పెండ్ చేయాలని జాతీయ బీసీ విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో ఏవో రాజేశ్వర్‌కు వినతి పత్రం అందించారు. బెల్లంపల్లి పట్టణం, మండలంలో విద్యాశాఖ అనుమతులు లేకుండా ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు ఏర్పాటవుతున్నా ఎంఈవో పట్టించుకోవడం లేదన్నారు. డీఈవోకు ఫిర్యాదు చేశామని, ఆయన చెప్పినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అఖిల్, రియాజ్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలి

నస్పూర్, మే 27 : ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో పనిచేస్తున్న హనుమాన్ దీక్షాపరులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మధ్యాహ్నం నుంచి వేతనంతో కూడిన సెలవులు ప్రకటించాలని వీర హనుమాన్ సేన సభ్యుడు చేరాల వంశీ అన్నారు. జిల్లా కేంద్రంలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. ఎండలు ఎక్కువగా ఉన్నందున దీక్షాపరులకు మధ్యాహ్న భిక్ష (భోజనం) తర్వాత నుంచి సెలవు ఇవ్వాలని కోరారు. అలాగే హనుమాన్ దీక్షాపరులు కొండగట్టుకు వెళ్లేందుకు ఉచితంగా బస్సులను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వినోద్, మహేశ్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

కళాయాత్ర పోస్టర్ల ఆవిష్కరణ

కోటపల్లి, మే 27 : చెన్నూర్ పట్టణానికి చెందిన నిరుపేద కళాకారుడు ఏల్పుల పోచం.. కశ్మీర్-కన్యాకుమారి కళాయాత్ర పేరుతో లైవ్ డ్రాయింగ్ వేస్తూ యాత్ర పూర్తి చేసిన సందర్భంగా వచ్చే నెల 7న కన్యాకుమారిలో నిర్వహించనున్న ముగింపు కార్యక్రమ పోస్టర్లను మండలంలోని పారుపల్లి గ్రామంలో సోమవారం ఆవిష్కరించారు. నిరుపేద అయిన పోచం, కళాయాత్ర పేరిట దేశం మొత్తం చుట్టి రావడం గర్వించదగ్గ విషయమని గ్రామస్తులు అన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★ అర్జెంట్‌గా హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ & ITI మెకానిక్స్ కావలెను. మంచి జీతం, వసతి సౌకర్యం కలదు. సంప్ర: 9392663777, 9246663777, 9290003999.
NT-339514-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677

నగదు అందజేత

చింతలమానేపల్లి, మే 27 : బాబాపూర్ గ్రామంలో ఆంజనేయ ఆలయ అభివృద్ధికి సైదం పోచయ్య పటేల్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం చైర్మన్ సైదం లక్ష్మీనారాయణ (తెలంగాణ హైకోర్టు అడ్వకేట్) రూ. 20 వేల నగదును యువకులకు అందజేశారు. ట్రస్ట్ ద్వారా గ్రామంలో మరిన్ని సేవలు అందిస్తామని లక్ష్మీనారాయణ అన్నారు. బాబాపూర్ యువకులు మేకల శివకుమార్, విష్ణేశ్, సంతోష్ పాల్గొన్నారు.

విద్యుత్ బకాయిలు చెల్లించాలి

చెన్నూర్ రూరల్, మే 27 : చెన్నూర్ మండలంలో విద్యుత్ వినియోగదారులు పాత బకాయిలు సకాలంలో చెల్లించాలని కొమ్మెర ట్రాన్స్‌కో ఈఏ భాస్కర్ తెలిపారు. మండలంలోని కొమ్మెర గ్రామంలో పాత బకాయిలు వసూలు కార్యక్రమాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వినియోగదారులకు పలు సూచనలను చేశారు. మీటరు లేనివారు కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలని సూచించారు. ఆయన వెంట లైన్‌మన్ రమేశ్ రెడ్డి, శ్రీనివాస్, సిబ్బంది మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా రమాబాయి వర్ధంతి

లక్షెట్టిపేట, మే 27 : బీఆర్ అంబేద్కర్ సతీమణి రమాబాయి వర్ధంతిని అంబేద్కర్ మండల, పట్టణ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అంబేద్కర్ సంఘం మండలాధ్యక్షుడు ముల్కల్ల రాందాస్, పట్టణ అధ్యక్షుడు తోగరి రాజు, మండల మాజీ అధ్యక్షుడు దొంత నర్సయ్య, కౌన్సిలర్ చాతరాజు రాజన్న, సభ్యులు ఆసాది పురుషోత్తం, మాలె చిన్నయ్య, కాంతయ్య, గోల్కొండ సత్తయ్య, దమ్మ నారాయణ, చుంచు రమేశ్, అల్లంపల్లి రమేశ్, శనిగారపు లింగన్న, దేవేందర్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

మందమర్రిలో..

మందమర్రి, మే 27 : మందమర్రి పట్టణంలో ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ సతీమణి రమాబాయి వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక సింగరేణి పాఠశాల సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద రమాబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఆ సంఘం నాయకులు మొయ్య రాంబాబు, వీర స్వామి, తుంగపిండి శంకర్, నరేశ్ పాల్గొన్నారు.

భగవద్గీత పుస్తకాల పంపిణీ

లక్షెట్టిపేట, మే 27 : మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం త్రిమత ఏకైక గురువు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్ అవార్డు గ్రహీత శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రభోదానంద యోగేశ్వర్ రచించిన భగవద్గీత పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు రాజు, సమితి సభ్యులు రవళి, అనుతేజ్, సాహిత్, సంధ్యారాణి, రవి, సునీత, రిషి, వేణుగోపాల్, రిషిత, రావణ్ తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిబిరం సద్వినియోగం చేసుకోవాలి

ఆసిఫాబాద్ టౌన్, మే 27: వేసవి శిబిరాల్లో పిల్లలకు ఆటపాటలతో పాటు సృజనాత్మకతను వెలికితీసేలా శిక్షణ ఇవ్వాలని ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా అన్నారు. ఆసిఫాబాద్ మండలం వట్టివాగు దిశ మోడల్ పాఠశాలలో సోమవారం భారత్ దేఖో స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి శిబిరాన్ని ఆమె సందర్శించారు. ఆర్ఆర్ కాలనీ పాడిబండలోని మోడల్ స్కూల్ నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌ను, అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. పిల్లలకు అందుతున్న పౌష్టికాహారంపై ఆరా తీయగా, నాణ్యమైన ఆహారం అందించడంలేదని నిర్ధారించుకున్న పీవో.. సంబంధిత అంగన్‌వాడీ కేంద్రం సూపర్‌వైజర్, ఆయాకు షోకాజ్ నోటీసులిస్తూ సస్పెన్షన్ చేయాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆమె వెంట గిరిజన సంక్షేమ శాఖ ఎసీఎంవో పుర్కా ఉద్దవ్, సహాయ గిరిజన సంక్షేమ అధికారి క్షేత్రయ్య, ఎస్సీఆర్పీ రాథోడ్ రవీందర్, భారత్ స్వచ్ఛంద సంస్థ వాలంటీర్లు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సీఆర్టీలు, గ్రామస్తులు ఉన్నారు.

పాఠశాలలను సిద్ధం చేయాలి

కోటపల్లి, మే 27 : విద్యా సంవత్సరం ప్రారంభానికల్లా పాఠశాలలను సిద్ధం చేయాలని